క్లుప్తంగా

విద్యార్థులతో కటువుగా వ్యవహరించొద్దు



హాస్టళ్ల సిబ్బందితో సమీక్షిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: తల్లిదండ్రులు తమ పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించాలనే ఉద్దేశంతో ఉన్నత చదువుల కోసం ఫీజులు కట్టి, వారిని హాస్టళ్లలో చేర్పిస్తారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విద్యార్థులకు ఇంటిని మరిపించేలా ఆదరణ అందించాలని, కటువుగా వ్యవహరించరాదని సూచించారు. క్యాంపస్‌లోని మెన్ అండ్ ఉమెన్ హాస్టళ్ల నిర్వహణపై బుధవారం సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థులు లేకుంటే హాస్టళ్లు ఉండవనే విషయాన్ని కూడా మీరు గ్రహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో హాస్టళ్ల వార్డెన్లు, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు వేల్పులమ్మ తల్లి వార్షిక తీర్థం

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని వేల్పులమ్మ వార్షిక తీర్థం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. తీర్థంలో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఊరేగించారు. ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన చేస్తారు.

ఘనంగా గోగులమ్మ తీర్థం



పెదరాయవరంలో గోగులమ్మ

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో కొలువైన గోగులమ్మ వార్షిక తీర్థం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చలివిడి, వడపప్పు, నైవేద్యం సమర్పించారు. కోలాటం, కోయనృత్యం, బాణసంచా కాల్పులతో వైభవోపేతంగా ఊరేగింపు జరిగింది.

బలభద్రపురంలో సర్వే

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ బీపీ, షుగర్, హెచ్‌బీ, రొమ్ము క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ పరీక్షలను చేస్తున్నామన్నారు. స్త్రీ, పురుషులలో వచ్చే రోగాల గురించి వివరంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ఆహారం, జీవన శైలిని వివరిస్తున్నామన్నారు. గ్రామంలోని 10 వేల మంది జనాభాను ఇంటింటి సర్వే ద్వారా పూర్తి చేయగలమన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం



నిందితుడు, సారాతో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మర్రిపూడి గ్రామంలో బుధవారం దాడి నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. గ్రామానికి చెందిన జీలం దుర్గయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

గ్రామ సంఘాల సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ మూర్తి

సీతానగరం: స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం గ్రామ సంఘాల సమీక్షా సమావేశం జరిగింది. మండల సమాఖ్య సంఘం అధ్యక్షురాలు కందికట్ల అరుణ కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మూర్తి, సంస్థాగత నిర్మాణ ఏపీఎం శ్రీనుబాబు పాల్గొని జీవనోపాదుల వార్షిక ప్రణాళిక సర్వే కోసం రివ్యూ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ రుణాలను జీవనోపాదుల కోసం వినియోగించాలన్నారు. అర్హత కలిగిన వారికి ఇ-శ్రమ్ బీమా చేయించాలన్నారు. పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించారు. పుస్తక నిర్వహణ రికవరీలు, ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జిలానీ, సీసీ డి.లక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, వీఓఏలు పాల్గొన్నారు.

వైద్యానికి వైరస్

- గ్రామాల్లో వైద్యం దయనీయం
- మూలనపడిన 108 అంబులెన్స్‌లు
- నిలిచిన 104 సేవలు
- దీర్ఘకాలిక రోగుల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వంలో అష్టకష్టాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం

సీతానగరం: కూటమి పాలనలో గ్రామాల్లో వైద్య సేవలు దయనీయంగా మారాయి. నాణ్యమైన వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. ఆరోగ్య కార్యక్రమాలు ఐసీయూ బాట పట్టాయి. దీర్ఘకాలిక రోగులు నానాపాట్లు పడుతున్నారు. మంచానికి పరిమితమైన వారికి వైద్యం దూరమైంది. పురిటి నొప్పులు వచ్చినా, ప్రమాదంలో గాయాలు, ఇతర అనారోగ్యానికి గురైనా ఒక్క ఫోన్ కాల్ చేస్తే కుయ్, కుయ్ అంటూ వచ్చే 108 అంబులెన్స్‌లు కుయ్యో మొర్రో అంటున్నాయి. పదిహేను రోజులకు ఒకసారి గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందించే 104 వాహనాలు మందులు లేక అందుబాటులో లేకుండా పోయాయి. అన్ని సేవలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం తామేదో గొప్పగా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఊదరగొడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తోంది.

అంబులెన్సుల దుస్థితి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మండలానికి 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇవి కొంతకాలంగా మరమ్మత్తులకు గురవుతున్నాయి. రోగులను వేగంగా ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన వాహనాలు కుయ్యో మొర్రో అంటు కదులుతున్నాయి. అంతే కాదు ఒక్కోరోజు మరమ్మతులకు గురై, డీజిల్ లేక వాహనాలు నిలిచివేసిన సందర్భాలూ ఉన్నాయి. వాటిలో పనిచేసే డ్రైవర్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదు.

మందులు లేని 104

మారుమూల గ్రామాలకు సైతం ఫ్యామిలీ ఫిజీషియన్ (కుటుంబ డాక్టర్) ద్వారా పదిహేను రోజులకు ఒకసారి వెళ్లి వైద్య సేవలు అందించిన 104 వాహనాల సేవలకు మందులు కరువయ్యాయి. గతంలో ప్రతి గ్రామాన్ని మ్యాపింగ్ చేసి, ఎంపిక చేసిన తేదీల్లో వైద్యులు, సిబ్బంది వెళ్లి సేవలు అందించేవారు. మంచాన ఉన్న రోగుల ఇళ్లకే వైద్యులు వెళ్లేవారు. పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించేవారు. ఇప్పుడు అలాంటి కార్యక్రమాలు ఏమీ కొనసాగడం లేదు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది మొక్కుబడిగా వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్య సురక్షతో భరోసా

దేశంలోనే తొలిసారిగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. స్పెషలిస్టు వైద్యులను గ్రామాలకు పంపించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించింది. అక్కడే పరీక్షలు చేసి ఆస్పత్రిలో వైద్యం అందించాల్సి ఉంటే మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి, కాకినాడలోని జీజీహెచ్‌కు తరలించేవారు. ఆ రోగి ఆసుపత్రి నుంచి డిచార్జ్ అయ్యే వరకూ ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ ఉండేది. వైద్యశిబిరాల్లో అన్ని రకాల మందులు, వ్యాది నివారణ పరీక్షలు కూడా నిర్వహించారు.



గత ప్రభుత్వంలో ఆరోగ్య సురక్షలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

దీర్ఘకాలిక రోగుల ఇబ్బందులు

కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా లేకపోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో రక్తపోటు, మధుమేహం, హైపో థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక రోగులను గుర్తించి, వారిని 104 సేవలకు మ్యాపింగ్ చేసేవారు. దీంతో ఆ గ్రామానికి వెళ్లినప్పుడు క్రమం తప్పకుండా మందులు వాడేలా చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కొందరు పీహెచ్‌సీల దారి పడుతుండగా, మరికొందరు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటికి వెళ్లి సేవలందిస్తున్న వైద్యుడు (ఫైల్)

వైద్య రంగాన్ని విస్మరించకూడదు



ప్రజలకు ఎంతో అవసరమైన విద్య, వైద్య రంగాలను ఏ ప్రభుత్వాలు విస్మరించకూడదు. వైద్య ఖర్చులు భరించలేక నేడు ఎంతో మంది ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, గ్రామీణ వైద్యాన్ని కూడా మరింత మెరుగుపర్చాలి. ఆరోగ్య కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగించాలి. ఎంతో మంది ప్రాణాలు నిలిపిన 108 సేవలు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత ప్రభుత్వ మాదిరిగా వైద్య సేవలు అందించాలి.

– మన్నెలి వెంకట్రావు, చీపురుపల్లి

స్పెషలిస్టు సేవలు దూరం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు వైద్యులు గ్రామాలకు వచ్చి పరీక్షలు చేసేవారు. ఇప్పుడు స్పెషలిస్ట్ వైద్యులు కావాలంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రతి 15 రోజులకు గ్రామానికే వైద్యులు వచ్చి పరీక్షలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటికి పరిమితమై మంచంపై ఉండే రోగులకు నేరుగా వైద్యులు సేవలు అందించేవారు. ఆ ఇప్పుడు అవన్నీ కనుమరుగయ్యాయి. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.

– చింతల జనార్దన గంగాధర్, నల్గొండ

దివాన్ చెరువు సచివాలయం పరిశీలన



దివాన్ చెరువు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: మండలంలోని దివాన్ చెరువు – 2 గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, జరుగుతున్న వివిధ శాఖల సర్వేల ప్రగతిని సమీక్షించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడం మన బాధ్యతనే విషయాన్ని సిబ్బందికి గుర్తు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర యాప్ 9552300009 వాట్సప్ గవర్నెన్స్ తీసుకువచ్చిందన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలందరి సెల్‌ఫోన్లలో ఈ నంబరును ఫీడ్ చేయించాల్సిన బాధ్యత మీదేనన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డీఎల్‌పీఓ పి.వీణాదేవి, రాజానగరం తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



జక్కంపూడి విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతానగరం: బొబ్బిల్లంకలోని గణపతి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేశారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు సుమారు రెండు వేల మంది భక్తులు హాజరయ్యారు.

జీజీయూలో వాతావరణ గడియారం



వాతావరణ గడియారాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న శశికిరణ్‌వర్మ

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో వాతావరణ గడియారం ఏర్పాటు చేయనున్నామని యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ గడియారాన్ని వాతావరణ శాస్త్రవేత్త, ఐఐటీ (ముంబై) ప్రొఫెసర్, ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చేతన్‌సింగ్ సోలంకి అందజేశారన్నారు. దీని ద్వారా ప్రపంచ వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన పెంచడంతోపాటు గ్లోబల్ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ మించి పెరగకూడదనే లక్ష్యానికి మిగిలి ఉన్న సమయాన్ని హైలెట్ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గడియారంతోపాటు స్వర్ణ ధ్రువపత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు. చంద్రశేఖర్, ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎస్ఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి



కందుకూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు

రాజానగరం: నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం నడయాడిన నేలపై ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మీరందరూ ధన్యులని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. యూనివర్సిటీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం కందుకూరి వీరేశలింగం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజాభివృద్ధికి ఆయన చేసిన కృషిని, అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంసీ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష

కంబాలచెరువు: లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్లో బుధవారం తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లా (రంపచోడవరం డివిజన్) పీఎంసీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీఎస్ సుభాషిణి ప్రారంభించారు. జిల్లాలోని 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల లోపు పనులు పూర్తి చేయాలని సుభాషిణి తెలిపారు. సీమాట్ లెక్చరర్ ప్రసాదరావు, మహేష్ రెడ్డి, జయలక్ష్మి తదితరులు పీఎంసీ 6 పిల్లర్లపై అవగాహన కల్పించారు. స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాత్ర చాలా గొప్పదన్నారు. లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు, నిర్వహణను అభినందించారు.

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ మాకొద్దు

- దాన్ని వేరే చోటుకు తరలించండి
- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వినతి



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురం గ్రామాల సమీపంలో ఏర్పాటు చేయనున్న చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌ను వేరే చోటకు తరలించాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు బలభద్రపురం గ్రామస్తుల తరఫున సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, చెత్త తరలించే వాహనాలు తిరగడం వల్ల వచ్చే ట్రాఫిక్ సమస్యలతో పాటు పలు అంటువ్యాధులు ప్రబలడానికి ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో (బలభద్రపురం గ్రామ పార్టీ కన్వీనర్) కొవ్వూరి వెంకటరామారెడ్డి, (ఎస్సీ విభాగం నాయకులు) గుబ్బల లాజర్ బాబు, పార్టీ నాయకులు సబ్బెళ్ల వీర రాఘవరెడ్డి, పడాల వెంకటరెడ్డి (మిఠాయి) ఉన్నారు.

చాగల్నాడు కాలువ పునరుద్ధరణకు చర్యలు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో 20 ఏళ్లుగా సాగునీరు అందిస్తున్న చాగల్నాడు ఎత్తిపోతల పథకం పంట కాలువ రంగంపేట – గండేపల్లి మండలాల మధ్య మాయమైన విషయం తెలిసిందే. అయితే దీని పునరుద్ధరణకు అడుగులు పడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్య శ్యామలం చేయడానికి 2004లో రూ.80 కోట్ల వ్యయంతో చాగల్నాడు ఎత్తిపోతల పథకం నిర్మించారు. దీని ద్వారా ఏడు మండలాలకు చెందిన 35 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. వాటిలో ఒక్క రంగంపేట మండలానికే 14 వేల ఎకరాలు కేటాయించారు. ఇందులో భాగంగా వడిశలేరు నుంచి మర్రిపూడి వరకు 21 కిలో మీటర్ల ప్రధాన పంట కాలువను తవ్వారు. నీటి సరఫరాలో ఒడిదుడుకులు ఉన్నా ఎనిమిది గ్రామాలకు ఉపయోగపడే ఈ కాలువను పెదరాయవరం–నాయకంపల్లి గ్రామాల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు 500 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పున పూడ్చివేసి పంట భూమిగా మార్చివేసారు. దీనివల్ల దిగువ గ్రామాలైన కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడికి సాగునీరు సరఫరా నిలిచిపోయింది. అటు చాగల్నాడు ఎత్తిపోతల పథకం అధికారులు, ఇటు ఈ గ్రామాల రైతులు 20 నెలలుగా కాలువ పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. కాలువ పూడ్చివేసిన భూమి గండేపల్లి మండలం నాయకంపల్లికి చెందినది కావడంతో పెద్దాపురం ఆర్డీఓ రమణి సమగ్ర నివేదిక మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. అక్రమార్కులపై చర్యలకు ఆదేశిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూలైలో సార్వా పంట కాలం నాటికి కాలువను పునరుద్ధరించాలని , నష్టపోయిన రంగంపేట మండలానికి చెందిన ఐదు గ్రామాల రైతులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై కాలువ పూడ్చివేసిన వారిపై గండేపల్లి మండలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్టు తెలియవచ్చింది. కాలువ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభం కావడంతో రైతుల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.



చాగల్నాడు కాలువను నాయికంపల్లి వద్ద పూడ్చివేసి పంట భూమిగా మార్చిన వైనం



పూడ్చివేయక ముందు చాగల్నాడు పంట కాలువ

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరిలకు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యల పరిష్కారం కోసం బుధవారం వినతిపత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కోడే ప్రకాష్ ఆధ్వర్యంలో ఉద్యోగ భద్రత, జీతాల పెంపు, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కనీస వేతనంగా రూ.26 వేలు అందించాలని, 2014లో కల్పించిన ఎఫ్‌టీఈ అమలు చేయాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు సాకిరి రాంబాబు, ఉపాధ్యక్షుడు సుంకవల్లి పోశారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు నారే సుబ్బారావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

వెదుళ్లపల్లిలోని బొల్లి మునియ్య మెమోరియల్ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్మించిన కాంపౌండ్ వాల్, సత్య బొల్లీస్ సైన్స్ ల్యాబ్, డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరిలతో కలిసి ఎంపీ పురందేశ్వరి బుధవారం ప్రారంభించారు. బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: కోరుకొండ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన బుధవారం శానిటోరియం వద్ద నుంచి కంబాలచెరువు వరకు చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. మొత్తం మూడు కిలోమీటర్లలో రోడ్డు వెడల్పు కోసం జరిపిన మార్కింగ్‌ను పరిశీలించారు. తక్షణమే పర్మనెంట్ ఎంక్రోచ్‌మెంట్లు తొలగించి, రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కోలమూరు పంచాయితీ పరిధిలోని ఎయిర్ పోర్ట్ రోడ్డులో డ్రైనేజీపై ఆక్రమణలు తొలగించాలని, మెయిన్ రోడ్డు లెవెల్‌కు చదును చేయాలన్నారు. తాడితోట వద్ద ఉన్న హాస్పిటల్ ఆక్యుపెన్సీ బిల్డింగ్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, ఏడీహెచ్ స్వాతి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ధర్మకర్తలు

పెదపూడి: జి.మామిడాడలోని సూర్యనారాయణపురంలో గల అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం రాజగోపురం నిర్మాణానికి సబ్బెళ్ల రామచంద్రారెడ్డి, సబ్బెళ్ల లక్ష్మణరెడ్డి సోదరులు రూ.లక్ష విరాళం అందించారు. బుధవారం ఆలయంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి మోహన్ రామగంగాధర్ రెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఆరవిల్లి రఘురామాచార్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ క్రికెట్ టోర్నీ విజేతగా గాడాల

సీతానగరం: ముగ్గళ్లలోని గోదావరి మాత విగ్రహం వద్ద అంబేడ్కర్ యూత్, బీజేపీ మట్టాడి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతకు బుధవారం ట్రోఫీ, నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు పాల్గొన్నారు. విజేతగా నిలిచిన గాడాల జట్టుకు రూ.20 వేలు, ట్రోఫీ, రన్నర్ పాలచర్లకు రూ.10 వేలు, మేన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గాడాల టీమ్ క్రీడాకారుడు మధుకు షీల్డ్ అందజేశారు.